# కాలప్రభావం

జట్కాబండి సీతమ్మ ఇంటిముందు ఆగింది. ఇరుగు పొరుగు ఆడ వాళ్ళు వాకిళ్ళలోకి వచ్చి చోద్యం చూస్తున్నారు. సీతమ్మ ఇంటికి వచ్చిన చుట్టం ఎవరా అని.

జట్కాలోంచి దిగింది సీతమ్మ కోడలు ప్రమీల.

కోడల్ని చూస్తూనే నివ్వెరపోయింది సీతమ్మ.

“బాగున్నావా అత్తయ్యా?” అంటూ పలకరించింది ప్రమీల.

ఆమె పలకరింపుతో తేరుకుని, “ఆ... (బాగున్నానమ్మా, అబ్బాయీ పిల్లలూ క్షేమమేనా? బుజ్జిగాడు బడికి వెళ్తున్నాడా లేక పేచీ పెడుతు న్నాడా?” అంది.

అత్తాకోడళ్ళు కుశలప్రశ్నలు వేసుకుంటూ వుండగా “ప్రమీలా! బాగున్నావా? ఇన్నేళ్ళకి మా వూరు గుర్తొచ్చిందన్నమాట” అంటూ ఇరుగు పొరుగు ఆడవాళ్ళు వచ్చి ఇంట్లో తిష్టవేశారు.

* * *

“కోడలు ఏంచేస్తూవుంది సీతమ్మొదినా?” రహస్యం అడుగుతున్న దానిలా అంది కాంతమ్మ వస్తూనే.

“అన్నంతిని పడుకుంది. దూరంనుంచి వచ్చిందికదూ పెందరాళే నిద్రపోయింది” అంది సీతమ్మ.

“ఎందుకొచ్చిందట?” అంది కాంతమ్మ.

“ఏమో! ఇంకా చెప్పలేదు. ఏదో పెద్దపనిమీదే వచ్చి వుంటుంది, ఇక్కడ నేనేదో సుఖపడిపోతున్నానని పొలంఅమ్మి డబ్బుఇవ్వమంటుం దేమో? అంది సీతమ్మ దిగులుగా.

"పొలం అమ్మితే నువ్వేం తింటావు? అడుక్కు తింటావా? నీ కొడుకు వూరుకోడులే"

"వాడిదేంవుంది. పిచ్చినన్నాసి. అంతా దీని పెత్తనమేగా. ఆమధ్య నాతో అననే అంది ప్రతిఏడూ తుఫానులు రానూ పంట వూడ్చుకుపోనూ మనకేం మిగులుతుంది? పొలం అమ్మేసి ఆ డబ్బు బ్యాంకిలో వేస్తే బోలెడు వడ్డీ వస్తుంది అని"

"అయితే ఆపనిమీదే వచ్చి వుంటుందంటావా?" ఆశ్చర్యంగా అంది కాంతమ్మ.

"లేకపోతే ఇంకేంపని దానికి? నన్ను తీసుకెళ్ళడానికివస్తుందంటావా వ్యంగ్యంగా నవ్వింది సీతమ్మ.

"ఆ మాత్రం ప్రేమేవుంటే నీతో పోట్లాడి ఎందుకు తరిమేస్తుంది ? హాయిగా కొడుకు దగ్గిరే మనవల్తో సుఖముగా వుండేదానివే గదా?" అంది కాంతమ్మ.

"ఎంతయినా పట్నంపిల్ల గదా! మనవంటే ఎందుకు పడుతుంది?"

"పడకపోతే నీకేందిగులు? వాళ్ళేం పెట్టి పోషిస్తున్నారా! ఏ వైనా గాని పొలం అమ్మడానికి నవేమిరా ఒప్పుకోకు" హెచ్చరించింది కాంతమ్మ.

"నా గొంతులో వూపిరుండగా ఒప్పుకుంటానా?" రోషంగా అంది సీతమ్మ.

* * *

మర్నాడు ప్రొద్దున్నే కోడలు నిద్రలేవకముందే పప్పురుబ్బి గారెలు చేసింది సీతమ్మ.

"నీకిష్టమని గారెలు చేశానమ్మాయ్! సాయంకాలం కజ్జికాయలుచేస్తా" అంది సీతమ్మ ప్రమీల లేవగానే.

"ఎందుకత్తయ్యా! లేనిపోనివన్నీ. మనం సాయంత్రము బయల్దేరి పోవాలి గదా!" అంది ప్రమీల.

"ఎక్కడికి"" ఆశ్చర్యపోతూ అంది సీతమ్మ.

"ఎక్కడికేమిటి? మన ఇంటికే. అత్తాకోడలన్నాక మాటా మాటా అనుకోకుండా ఎవరుంటారు? నేనేదో అన్నానని చెప్పా చెయ్యకుండా వూరెళ్ళిపోయినందుకు నేనెంత బాధపడ్డానో తెలుసా? మీ అబ్బాయి నన్ను చెడామడా తిట్టి ఆపూట భోజనం చెయ్యకుండా పడుకున్నారు. అయినా ఈ వయసులో ఈ పల్లెటూళ్ళో ఒంటరిగా ఎందుకుండాలి? మేమంతా లేమూ? పిల్లలు,మామ్మ ఎక్కడికెళ్ళిందని? ఎప్పుడొస్తుందనీ?" ఒకటేగొడవ...."

కోడలు చెప్పేమాటలు వింటూనే గాలికొడుతున్న రబ్బరుబెలూన్‌లా వుబ్బిపోసాగింది సీతమ్మ.

పొలం గురించి ఒక్కమాట అనలేదు ప్రమీల. తనవూహలు తారుమారయినందుకు సీతమ్మ ఆశ్చర్యానికి అవధులు లేవు.

ఆఖరికి ప్రమీలే అంది."ఎవరికన్నా కౌలుకు ఇచ్చేయండి అత్తయ్యా అని"

కోడలు ఏం మంత్రం వేసిందోగాని పాత సంగతులన్నీ మర్చిపోయింది సీతమ్మ. సాయంకాలము కోడలితోపాటు పట్నానికి ప్రయాణమైంది సీతమ్మ.

జట్కాబండి వెంట ఊరిచివర వరకూ వచ్చి వీడ్కోలు యిచ్చారు బంధువులు, స్నేహితులూను

"ఎంత పోట్లాడుకున్నా అత్తాకోడలూ ఒక్కటే. అత్తంటే ప్రమీలకు ప్రేమే" అంది కాంతమ్మ.

ఆమె మాటలకు అందరూ ఔనన్నారుగాని ఆమె చిన్నకొడుకు రఘు మాత్రం పకపకా నవ్వాడు తల్లి మాటలకు.

తను అన్నదాంట్లో అంత నవ్వాల్సిన సంగతి ఏముందో కాంతమ్మకి అర్థంకాలేదు.

"ఎందుకురా పిచ్చాడిలా అట్లా నవ్వుతున్నావు?" అంటూ కొడుకుని కసిరింది కాంతమ్మ.

"కోడలికి అత్తమీద ప్రేమంటేనే నవ్వొచ్చింది. అసలు సంగతి మీకు తెలియదు కోడలికి ఆపదలో అత్తగారు గుర్తొచ్చింది."

ఏమిట్రా నీ మాటలు ?"

మొగుడూ పెళ్ళాం ఇద్దరూ హైదరాబాద్‌లో వుద్యోగం చేస్తున్నారు గదా?"

"అవునూ. ఇప్పుడు వాళ్ళకి ఏం ఆపద ముంచుకొచ్చింది?" అంది కాంతమ్మ.

"ఇప్పుడేమో ఆఫీసుకి వెళ్ళే టైము మార్చారు గవర్నమెంటువాళ్లు. ప్రొద్దున్నే ఏడున్నరకి వెళ్తే ఇక మధ్యాహ్నం రెండుంబావుకే వదిలేది?"

"అయితే మాత్రం ఏం? తెల్లవారుజామునే లేచి క్యారేజీలా పట్టుకు వెళ్తారు" అంది కాంతమ్మ.

"మరి పిల్లల్ని ఎవరుచూస్తారు? వాళ్ళు తొమ్మిదింటికి గదా బడికి వెళ్ళేది. అందుకే అత్తని తీసుకెళ్తున్నది" అన్నాడు రఘు నవ్వుతూ.

అంతా తెల్లముఖాలు వేశారు. *

ప్రచురణ : ఆంధ్ర సచిత్ర వారపత్రిక,

31-8-79